
# పుత్రికాకామేష్టి




## 21

### కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

రేడియోలో రామాయణ వ్యాఖ్యానం వస్తోంది.

దశరథుడి పుత్రకామేష్టియాగం ముగియగానే, ప్రాజాపత్యపురుషుడు ప్రత్యక్షమై, దివ్యపాయసపాత్రనిస్తూ "దశరథా! ఈ పాయసాన్ని నీరాణుల చేత ఆరగింపజెయ్యి. నీకు సంతానప్రాప్తి కలుగుతుంది" అని అదృశ్యమైనాడు. ఆ విధంగానే, దశరథుడు తన రాణులకు యజ్ఞ పాయసాన్నిచ్చి, అవతార పురుషుడైన శ్రీరామచంద్రుడ్ని, భరత, లక్ష్మణ, శత్రుఘ్నులను సంతానంగా పొందాడు -

"ఏమండీ..... భోజనం వడ్డించాను రండి...." అంటూ వచ్చింది కమల.

ఆనందరావు రేడియో కట్టేసి, భోజనానికి లేచాడు.

"ఇవాళ అన్నీ నాకిష్టమైనవే చేశావ్. ఏమిటి విశేషం?" అన్నాడు గుత్తొంకాయ రుచి చూస్తు, ఆనందరావు.

"ఇవాళ మన పెళ్లిరోజు కదండీ..." అంది నవ్వుతూ కమల.

"ఓహో... అవును కదూ? మరి, కొత్త చీర ఉందా?"

"మొన్న మా అమ్మ పసుపు, కుంకం ఇవ్వటానికొచ్చినపుడు పెట్టిన చీర ఉందిగా.... అది కట్టుకుంటాలెండి..."

"రక్షించావ్... ఇప్పుడు కొనమంటావేమోనని భయపడ్డాను..." అన్నాడు మంచినీళ్ళు తాగుతూ.

"మిమ్మల్నేవిషయంలో ఇబ్బంది పెట్టానండీ?!" అంది కమల నిష్ఠూరంగా.

"ఇద్దరు ఆడపిల్లల్ని కనడం తప్ప, ఏ విషయంలోనూ నన్ను ఇబ్బంది పెట్టలేదు..."

"భగవంతుడిచ్చిన దానికి నేనేం చెయ్యగలనండీ?" దీనంగా అంది.

"నువ్వేమీ చెయ్యలేవని నాకు తెలుసు. అందుకే.... నేనే చెయ్యదలచుకున్నాను."

"ఏమిటది?"

"రేపు మనం రామకృష్ణ ఆస్పత్రికి వెళ్తున్నాం."

"ఎందుకు?"

"వాడు రేడియోలజిస్టు కద! పైగా మా పిన్నికొడుకు. ఈమాటు నీకు పుట్టబోయేది ఆడో, మగో 'స్కానింగ్'లో చూసి చెబుతాడు."

"అర్థమయింది! పుట్టబోయేది ఆడపిల్ల అయితే అబార్షన్ చేయిస్తానంటారు. అంతేగా?"

"అనటం కాదు. అక్షరాలా అలాగే చేయిస్తాను...."

"పాపమండీ..."

"అయినా ఫర్వాలేదు....'

"నేరమండీ....."

"కంప్లయింట్ ఇస్తే కద నేరం! నువ్వు కంప్లయింట్ చేస్తావా?"

కమల మరేం మాట్లాడలేదు.

× × ×

"కంగ్రాట్యులేషన్స్‌రా"... అన్నాడు రామకృష్ణ 'స్కానింగ్' తర్వాత ఆనందరావు భుజం తడుతు.

"ఏమిటీ? మగపిల్లాడేనా?!" నమ్మలేనట్టు అడిగాడు ఆనందరావు.

"చెప్పాగా.... ఇంకా ఎందుకు సందేహం?" అన్నాడు రామకృష్ణ నవ్వుతూ.

"థాంక్స్‌రా! ఇప్పటికే ఇద్దరు ఆడపిల్లలు....మళ్లీ ఆడపిల్ల పుడుతుందేమోనని భయపడి చచ్చాననుకో...."

"ఎందుకు భయం?"

"ఎందుకేమిట్రా? ఆడపిల్లలు కన్నవాళ్లకి అన్నీ కష్టాలే కదరా? చదివించాలి.... పెద్దకట్నాలిచ్చి పెళ్లి చెయ్యాలి.... అల్లుడి ఆగడాలన్నీ భరించాలి...."

"అవన్నీ నీ భ్రమ..."

"నీకేం? నువ్వలాగే చెబుతావ్. నీకు ఇద్దరూ మగపిల్లలేగా!"

"నువ్వు నమ్ముతానంటే, మేమిద్దరం ఆడపిల్ల కావాలనే అనుకున్నాం. ఇప్పటికీ మాకు ఆడపిల్ల లేదనే బాధపడుతుంటాం....'

"మనిషికో బాధ మహిలో సుమతీ అన్నారందుకే! లోకంలో అందరూ ఆడపిల్లలొద్దనుకుంటుంటే.... నువ్వేమిట్రా తిరకాసుగా మాట్లాడతావ్. సరే... నీతో చర్చ ఎందుగ్గానీ.... కమల వస్తోంది. వెళ్తొస్తాం... ఇప్పటికే ఆలస్యమైంది" అంటూ నిష్క్రమించాడు ఆనందరావు.

పుట్టబోయే వంశోద్ధారకుడి కోసం నిరీక్షిస్తూ, ఆనందరావు తన భార్యని అపురూపంగా చూసుకోసాగాడు. డాక్టరు ఇచ్చిన తేదీ రానే వచ్చింది. 'లేబర్‌రూమ్'లోకి భార్యని తీసుకెళ్లిన దగ్గర్నుంచీ, క్షణక్షణం ఆందోళన పడుతూనే ఉన్నాడు ఆనందరావు. ఎందుకైనా మంచిదని, పిన్నికొడుకు డాక్టర్ రామకృష్ణకి ఫోను చేశాడు. కాస్సేపటిలో రామకృష్ణ భార్యతో బాటు వచ్చాడు.


వాళ్లు వచ్చిన అయిదు నిముషాలకే సుఖప్రసవం కబురు వచ్చింది.

"బాబు కులాసాగా ఉన్నాడా?" అనడిగాడు నర్సుని ఆతృతగా ఆనందరావు.

"బాబు కాదు... పాప! కులాసాగానే ఉంది" అని వెళ్లిపోయింది లోపలికి.

ఆనందరావ్‌కి కొద్ది క్షణాలు అయోమయమనిపించింది. డాక్టరు రామకృష్ణకేసి చూశాడు. మందహాసంతో "అవును! నాకు ముందే తెలుసు. నీకు చెబుతే, ఆ అమాయకప్రాణిని అంతం చేయిస్తావని అబద్ధమాడాను...." అన్నాడు. రామకృష్ణ మాటలకి ఏమనాలో తోచలేదు ఆనందరావుకి.

నిస్పృహతో, గంభీరంగా బల్లమీద కూర్చుండిపోయాడు.



"ఆనందం! ఆడపిల్లల్ని పుట్టకుండా అంతం చేస్తుండటం వల్ల ఇప్పుడు జనాభాలో వాళ్ల శాతం రోజురోజుకీ తగ్గిపోతోందనే, ప్రభుత్వం పుట్టబోయే బిడ్డల గురించి చెప్పరాదని చట్టం చేసింది. అయినా, ఆడపిల్లలకి అపచారం జరుగుతునే ఉంది. మళ్లీ మనం కన్యాశుల్కం రోజులు చూడాలేమో" రామకృష్ణ మాటలకి ఆనందరావులో ఎలాంటి స్పందనా లేదు.

"నేను వృద్ధాశ్రమాల్లో ఉన్నవాళ్లకి ఉచిత వైద్యం చేయటానికి వెళ్తుంటాను. అక్కడ కొడుకుల చేత గెంటివెయ్యబడిన వాళ్లే తప్ప, కూతుళ్ల చేత అనాదరణ చెయ్యబడ్డవాళ్లెవరూ లేరు. అందాకా ఎందుకు? మా నాన్నకి పక్షవాతం వచ్చి మంచాన పడితే, తను పెళ్లి చేసుకోకుండా మా పెద్దక్కయ్యే మమ్మల్నందర్నీ పైకి తీసుకువచ్చింది కద! పూర్వం పుత్రకామేష్ఠి చేసేవారు. కానీ, ఇప్పుడు చేయాల్సింది పుత్రికాకామేష్ఠి..."

ఆశ్చర్యంగా చూశాడు ఆనందరావు.

"అలా ఆశ్చర్యపడకు. నేను అక్షరసత్యం చెబుతున్నాను. ఆడపిల్లలే ఇవాళ కుటుంబ బాధ్యతలు మోస్తున్నారు. తల్లిదండ్రుల్ని, అత్తమామల్ని సమానంగా ప్రేమగా చూస్తున్నారు. నీకు మగపిల్లలు లేరని బాధపడకు. మా ఇద్దరి పిల్లల్లో చిన్నవాణ్ణి దత్తత తీసుకో. మేము ఇప్పుడు పుట్టిన మీఅమ్మాయిని దత్తత తీసుకుంటాం. ఈ నిర్ణయం ఆ రోజున కమలకి స్కానింగ్ చేసినపుడే తీసుకున్నాను. అందుకే నీకు కావాలని అబద్ధం చెప్పాను. ఈ విషయం నా భార్య క్కూడా తెలుసు" రామకృష్ణ భార్య "అవునండీ..." అంటూ గొంతు కలిపింది.

(ఆకాశవాణి సౌజన్యంతో)